
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 18.0

ANDHRAJYOTHY 5



చికిత్స పొందుతూ వివాహిత మృతి

అలంపూరుచౌరస్తా, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని శేరుపల్లి గ్రామానికి చెందిన వివాహిత కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు... శ్రీనువాసులు, రాములమ్మ కుమార్తె శిరీష(19), వనపర్తి జిల్లా దుప్పల్లి గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డిని కులాంతర వివాహం చేసుకున్నది. శనివారం ఆమె స్వగ్రామానికి వచ్చి మరుసటిరోజు ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.



పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

అచ్చంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ వైద్యులకు సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రిలోని ప్రతీ విభాగాన్ని పరిశీలించి వాటి పని తీరును అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఓపీ, ఇన్‌పేషంట్ వార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైనా వైద్యం అందించాలన్నారు. మలేరియా, డెంగీ వ్యాధుల సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పోలీసుల పహారాలో వ్యవసాయ మార్కెట్




మార్కెట్‌లో కొనుగోలు చేసిన వేరుశనగను సంచులలో నింపుతున్న హమాలీలు

అచ్చంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధర కోసం వేరుశనగ రైతులు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నరింహ్మాతో పాటు చైర్‌పర్సన్ రజిత భర్తపై సోమవారం దాడి చేసిన విషయం విధితమే.. ఈ నేపథ్యంలో సోమవారం నిలిచిపోయిన వేరుశనగ కొనుగోళ్లను మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా వ్యవసాయ మార్కెట్‌లో డీఎస్పీ పల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం టెండర్ అయిన గరిష్ఠ ధర రూ.6,670 కాగా కనిష్ఠ ధర రూ. 4,010 పలికింది. ఆ ధరలకే మంగళవారం కొనుగోలు చేశారు. బుధవారం అమావాస్య ఉండటంతో మార్కెట్ బంద్ ఉంటుందని, వచ్చిన ధరకు రైతులు వేరు శనగను విక్రయించారు. ఏది ఏమైనా అధికారులపై దాడి సరికాదని వివిధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు దాడిని ఖండించారు.



అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ర్యాలంపాడు మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్



- రూ.144కోట్లతో ప్రతిపాదనలు
- గ్రౌటింగ్ కట్టవెడల్పు రివిట్‌మెంటు పనులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షతో కదలిక
- మూడేళ్ల క్రితమే నిపుణుల కమిటీ నివేదిక
- కాలయాపనతో కాలం వెళ్లదీసిన గత ప్రభుత్వం

మూడేళ్లక్రితమే ర్యాలంపాడు రిజర్వాయర్‌కు లీకేజీల సమస్య మొదలైంది. ఈ నేపథ్యంలో 2021 అక్టోబరులో నిపుణుల కమిటీ పరిశీలించి నీటి నిల్వ సామర్థ్యాన్ని నాలుగు టీఎంసీల నుంచి రెండు టీఎంసీలకు తగ్గించింది. నాటి నుంచి నేటి వరకు ప్రతీ ఏడాది యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటిస్తూవస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల మరమ్మతు పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.144 కోట్లతో మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. ఈ వేసవిలో పనులు పూర్తి చేసి వానాకాలంలో పూర్తిస్థాయిలో నాలుగు టీఎంసీల నీటిని నిల్వచేసి రెండు పంటలకు సాగునీరు అందించాలని అధికారులు నిర్ణయించారు.

- గద్వాల, ఆంధ్రజ్యోతి

6

రేపటి నుంచి జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆలయంలోని విగ్రహాలకు సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

అలంపూరు జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ దేవి వార్షిక బ్రహ్మోత్సవాలు 30వ తేదీ నుంచి ఫిబ్రవరి మూడు వరకు నిర్వహించనున్నట్లు ఈవో పురేందర్ కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆలయ అర్చకులు, సిబ్బంది తుంగభద్ర నదీ జలాలతో ఆలయంలోని అమ్మవారి విగ్రహంతో పాటు ప్రధాన విగ్రహాలను శుద్ధి చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం 6:30 గంటలకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గురువారం అమ్మవారి ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఫిబ్రవరి 3న అమ్మవారి నిజరూప దర్శనం, సహస్ర ఘటాభిషేకం, సాయంత్రం జోగుళాంబ దేవి, బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణం ఉంటుందని తెలిపారు.

కోరిన కోర్కెలు తీర్చే పాలెం వెంకన్న

- రేపటి నుంచి ఆరో తేదీ వరకు పాలెం బ్రహ్మోత్సవాలు
- నాలుగో తేదీన రథోత్సవం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ



ఉత్సవాలను పురస్కరించుకొని విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న పాలెం వేంకటేశ్వరస్వామి దేవాలయం

7


యువతి ఆత్మహత్య కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు

- రూ. 20,200 జరిమానా

7

నకిలీ వైద్యులూ.. పారాహుషార్

- రాష్ట్రవ్యాప్తంగా యాంటీ క్వాకరీ లీగల్ కమిటీల ఏర్పాటు
- మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోనూ అమలు
- ఫిబ్రవరిలో దాడులు చేసేందుకు సన్నాహాలు



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. అర్హతలు లేకపోయినా వైద్యం చేస్తూ, విచ్చలవిడిగా యాంటి బయాటిక్స్ అంటగట్టి ప్రజల ఆరోగాన్ని నాశనం చేస్తున్న నకిలీ వైద్యులపై కొరడా ఝుళిపించనుంది. ఇప్పటికే తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రాష్ట్రవ్యాప్తంగా యాంటీ క్వాకరి లీగల్ కమిటీలను ఏర్పాటు చేసి, విస్తృతంగా దాడులు చేస్తోంది. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో దాడులు చేసి, 400 మంది నకిలీ వైద్యులపై కేసులు కూడా నమోదు చేశారు. అయితే మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు కూడా ఆరుగురు డాక్టర్లతో కమిటీని ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి నుంచి దాడులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నకిలీ వైద్యుల ఆగడాలు ఎక్కువయ్యాయి. అర్హత లేకున్నా అల్లోపతి వైద్యం చేయడంతో పాటు విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్, పెయిన్‌కిల్లర్ మందులు, స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. దాంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. భవిష్యత్తులో మనిషికి ఆ యాంటీ బయాటిక్స్ పని చేసే పరిస్థితి లేకుండా పోతోంది. దాంతో ఇప్పుడున్న మందులు కాకుండా కొత్తరకం తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యాంటీ క్వాకరీ లీగల్ కమిటీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నేతృత్వంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో కూడా ఆరుగురు డాక్టర్లతో కూడిన ఈ కమిటీని



నియమించారు. కమిటీ ఇన్‌చార్జిగా డాక్టర్ మహేశ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుజిత్ అగర్వాల్, డాక్టర్ సుశ్రిత్‌లతో పాటు మరో ఇద్దరు స్థానిక డాక్టర్లు ఉన్నారు. వీరంతా పోలీసుల సహాయంతో దాడులు చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేసినా, విచ్చలవిడిగా యాంటి బయాటిక్స్ మందులు ఇచ్చినట్లు తేలినా, అర్హత లేని ధ్రువపత్రాలు, నకిలీ సర్టిఫికెట్లు ఉన్నట్లు గుర్తించినా కేసులు నమోదు చేస్తారు. ఆయా ఆస్పత్రులను సీజ్ చేస్తారు.

ఫిబ్రవరిలో దాడులు

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో యాంటీ క్వాకరీ, లీగల్ కమిటీని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ ఫిబ్రవరిలో పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుంది. అదే నెలలో విస్తృతంగా దాడులు చేస్తాం. ప్రలోభాలకు తలొగ్గకుండా దాడులు చేసి, అర్హత లేని వారిపై కేసులు నమోదు చేస్తాం. జరిమానాలు కూడా విధిస్తాం. ప్రజారోగ్యాన్ని పాడు చేసే వారిని ఎవ్వరినీ వదలం.

- డా. శ్రీనివాస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్

నేటి నుంచి ఈదమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ఠోత్సవాలు

హాజరు కానున్న ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో పునర్నిర్మించిన ఈదమ్మ తల్లి దేవాలయం

కొల్లాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఈదమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దాతృత్వంతో నిర్మించిన ఈ దేవాలయంలో ఈదమ్మ తల్లి దేవతా మూర్తుల పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వ హించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు హాజరు కానున్నారని దేవాలయ పునర్నిర్మాణ కార్యనిర్వహణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాల తయారీ

7

కనుల పండువగా అంజన్న రథోత్సవం

- కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించిన జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి
- ప్రత్యేక పూజలు చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి
- భారీగా తరలివచ్చిన భక్తులు
- అభయుడి నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు



ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి రథోత్సవానికి హాజరైన భక్తులు

6

రిజర్వాయర్ కోసం స్థల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూర్ వద్ద నిర్మించే పెద్ద చెరువు రిజర్వాయర్, లిఫ్టు కోసం మండలంలోని బాపూర్ గ్రామం వద్ద కేటాయించిన భూమిని ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులు మంగళవారం పరిశీలించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు, జిల్లా ఇరిగేషన్ అధికారులు గ్రామంలో సబ్ స్టేషన్, పంప్‌హౌస్ నిర్మాణం కోసం కేటాయించిన దాదాపు 10 ఎకరాల స్థలాన్ని చూశారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఎక్కడ నిర్మించాలి?, విద్యుత్ లైన్ ఎలా తేవాలి?, చెరువు నుంచి నీటిని ఎత్తిపోయడానికి పంప్ హౌస్ ఎక్కడ నిర్మించాలి? అనేది మ్యాప్ ఆధారంగా పరిశీలన చేశారు. ఎక్కడి నుంచి లైన్ తెస్తే బాగుంటుందనే విషయాన్ని ట్రాన్స్‌కో ఎస్ఈ ఏ.సరస్వతి, ఈఈలు జీ.భద్రయ్య, డీ.దేవానంద్, ఈ.శౌఖత్ ఇరిగేషన్ ఎస్ఈ హెచ్‌టీ శ్రీధర్, ఈఈ బ్రహ్మానంద్‌లతో చర్చించారు. కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ట్రాన్స్‌కో శాఖ ఈఈలు జే.యాదగిరి, బీ.నాగరాజు, ఏఈలు వై.శ్రావణ్, కే.అశోక్‌కుమార్, ఇరిగేషన్ శాఖ డీఈలు శ్రీనివాస్, కేతన్‌కుమార్, కిరణ్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

కృష్ణ మండలంలో హైనా సంచారం

కృష్ణ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఖాన్‌దొడ్డి-కొత్తపల్లి గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో ఓ జంతువు సంచరిస్తోందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. గుట్ట ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఓ కుక్క కళేబరాన్ని గుర్తించిన గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు మంగళవారం జంతువు పాదముద్రలను సేకరించారు. జరిగిన ఘటనను పరిశీలిస్తే హైనాగా గుర్తించినట్లు చెప్పారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ఉండాలని ఆయన సూచించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు కొండాపూర్ విద్యార్థులు



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 29 నుంచి 31 వరకు మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో జరిగే 68 రాష్ట్ర స్థాయి పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరఫున కొండాపూర్ విద్యార్థులు పాల్గొననున్నట్లు పీఈటీ ఆంజనేయులు తెలిపారు. పాఠశాలకు చెందిన సైదులు, కార్తీక్, అభిరామ్, వెంకటేష్‌లు పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ రాంమోహన్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్య శ్రీనివాస్‌నాయక్, పీఈటీ అభినందించారు.

మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్‌లు

- ప్రస్తుతం 49 వార్డులు.. కొత్తగా చేరనున్న 11
- జైనల్లీపూర్, దివిటిపల్లి గ్రామాల రికార్డులు సీజ్
- ఫిబ్రవరి 6లోగా ప్రక్రియ పూర్తి చేయాలని జీవో విడుదల
- ఆ తరువాతే వార్డుల విభజన



మహబూబ్‌నగర్ పట్టణం

మహబూబ్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలికను కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ, ఇదివరకే గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా అందుకు సంబంధించి జీవో నెంబర్ 14ను విడుదల చేసింది. 60 డివిజన్‌లతో కార్పొరేషన్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం పురపాలికలో 49 వార్డులు ఉండగా, అందరూ 2-3 పెరుగుతాయని అంచనా వేశారు. అయితే తాజాగా విడుదల చేసిన జీవోలో 60 డివిజన్‌లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దాంతో రాజకీయ ఆశావహులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. కొత్తగా 11 స్థానాలు పెరగడంతో వారికిది కలిసొచ్చే అంశం. అయితే కార్పొరేషన్‌లో దివిటిపల్లి, జైనల్లీపూర్ రెండు గ్రామ పంచాయతీలనే విలీనం చేశారు. దాంతో ప్రస్తుతం వెలువడ్డ జీవోలో ఆ రెండు జీపీలకు సంబంధించిన రికార్డులను సీజ్ చేసి, స్వాధీనం చేసుకోవాలనే ఆదేశాలతో మంగళవారం పుర అధికారులు దివిటిపల్లి జీపీని సందర్శించి, రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రికార్డులతోపాటు ప్రస్తుతం అక్కడ పని చేస్తున్న ఉద్యోగులు, జీపీ బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఆయా జీపీలకు భూములు, భౌగోళిక స్వరూపం పూర్తి వివరాలు సేకరించి ఫిబ్రవరి ఆరో తేదీలోగా సీడీఎంఏకు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత వార్డుల విభజన జరగనుంది.

మారనున్న వార్డుల స్వరూపం

మహబూబ్‌నగర్ పురపాలికలో ఇదివరకు 49 వార్డులు ఉండగా.. రెండు నుంచి మూడు పెంచొచ్చని, ప్రస్తుతం ఉన్న వార్డులలో మార్పు పెద్దగా ఉండకపోవచ్చని అంతా భావించారు. కానీ 11 డివిజన్‌లు పెరుగుతుండటంతో ప్రస్తుతం ఉన్న వార్డుల స్వరూపం చాలావరకు మారే అవకాశం ఉంది. పురపాలిక పరిధిలో 2.90 లక్షల జనాభా ఉంది. దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామ పంచాయతీల జనాభాను కలిపితే దాదాపు మూడు లక్షలకు చేరే అవకాశం ఉన్నందున మిగతా గ్రామాలను టచ్ చేయొద్దని నిర్ణయించారు. 2020 ఎన్నికల్లో పాలమూరు పురపాలికలో 1,69,450 మంది ఓటర్లు ఉన్నారు. 49 వార్డులకు గాను ఒక్కో వార్డులో మూడు వేల నుంచి 3,800 మంది ఉన్నారు. ఈ ఐదేళ్లలో మరో 14 వేల 15 వేల మంది ఓటర్లు పెరిగారు. దివిటిపల్లి, జైనల్లీపూర్ ఓటర్లను కలిపితే మొత్తం 1.88 లక్షల మంది ఓటర్లు కానున్నారు. ప్రస్తుతం 60 డివిజన్‌లు కానుండటంతో వార్డుల ఓటర్లు గతంలో కన్నా తగ్గే అవకాశం ఉంది. ఒక్కో డివిజన్‌లో 3,000 నుంచి 3,200 ఓటర్లు మాత్రమే ఉండే అవకాశం ఉంది. వార్డుల విభజన జరిగితే ప్రస్తుతం ఉన్న వార్డుల స్వరూపం మారనుంది. సగం వరకు ప్రస్తుతం ఉన్న వార్డు మారే అవకాశం లేకపోలేదు. దాంతో ఇప్పుడు పాత వార్డులపై ఆశలు పెట్టుకున్న సిట్టింగ్ కౌన్సిలర్లు, ఆశావహులకు కొత్త తలనొప్పి వచ్చింది.

31న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

జడ్చర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 31న జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుకన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకార్తికేయ సెక్యూరిటీ సర్వీస్ సహకారంతో కళాశాలలోని తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. కనీస విద్యార్హత పదోతరగతి పాసై, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో 31న ఉదయం 11 గంటలకు కళాశాలలోని సెమినార్ హాల్‌లో జరిగే జాబ్ మేళాలో పాల్గొనాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

హన్వాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అత్తగారి ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి కనిపించకుండా పోయాడని భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ మంగళవారం తెలిపారు. కొత్తకోట మండలం పాలెం గ్రామానికి బత్తుల వెంకటయ్య చిన్నదర్పల్లి గ్రామానికి వచ్చాడు. ఈనెల 10న తిరిగి తన గ్రామానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. 20 రోజులైనా అటు సొంత గ్రామానికి, ఇటు అత్తగారి ఊరికి రాకపోవడంతో మంగళవారం హన్వాడ పోలీసులకు అతని భార్య ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దతు ధర కోసం రైలు పట్టాలపైకి



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

పాలమూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగకు గిట్టుబాటు ధర ఇవ్వాలని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రైతులు మంగళవారం రైలు పట్టాలపైకి వచ్చి ఆందోళన చేశారు. అదే సమయంలో గూడ్సు రైలు రావడంతో పోలీసులు రైల్వే అధికారులకు ఫోన్ చేసి, రైలును స్లో చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం మార్కెట్‌కు తెచ్చిన వేరుశనగకు తక్కువ ధర పలికిందని రైతులు ఆగ్రహించారు. మార్కెట్ యార్డు అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై తమను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు 8,192 క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ. 6190 ధర పలికింది. కనిష్ఠ ధర రూ. 5489, మాడల్ ధర రూ. 3509 పలికింది. సోమవారం కంటే క్వింటాల్‌కు రూ. 20 తక్కువ ధర రావడంతో రైతులు మార్కెట్ యార్డు నుంచి రోడ్డుపైకి వచ్చారు. తర్వాత నవాబ్‌పేట రోడ్డు మీదుగా బోయపల్లి రైల్వే గేటు వద్దకు వచ్చారు. గేటు వేసుకొని ఉండటంతో కింద నుంచి రైల్వే పట్టాలపైకి వెళ్లారు. అదే సమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు గూడ్స్ రైలు వెళ్తోంది. నలుగురైదుగురు రైతులు పట్టాలపైకి వెళ్లడంతో పోలీసులు రైల్వే అధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని తెలియజేశారు. దాంతో రైల్వే అధికారులు రైలును స్లో చేశారు. అనంతరం పోలీసులు పట్టాలపైకి వెళ్లిన రైతులను వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ఇతర పోలీసులు వెనక్కి తీసుకొచ్చారు. అక్కడి నుంచి మార్కెట్ యార్డు గేటు వద్దకు తీసుకొచ్చారు. అక్కడ కూర్చోబెట్టి మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పని చేస్తే గిట్టుబాటు ధర ఇవ్వకపోగా, కనీస మద్దతు ధర ఇవ్వడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రైతులకు మేలు చేసేదిపోయి, వ్యాపారులతో రూపాయి కమీషన్ మాట్లాడుకొని తమను నట్టేట ముంచుతున్నారని అన్నారు. గతంలో వడ్లు కొనుగోలు చేసినప్పుడు తప్పుడు లెక్కలు చెప్పి, పాలకవర్గాన్ని తికమక పెట్టిన అధికారులను చైర్మన్ ఏమీ అనలేదన్నారు. నూతన పాలకవర్గం ఏనాడూ రైస్ మిల్లులను తనిఖీ చేయలేదని అన్నారు. టోల్‌గేట్ కట్టి రాయిచూర్ నుంచి ధాన్యాన్ని తెస్తే ఇక్కడా మోసం చేయడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం అధికారులు, వ్యాపారులు, రైతులతో పోలీసులు చర్చించారు. క్వింటాల్ ధరపై రూ. 200 అదనంగా ఇస్తామని అధికారులు, పాలకవర్గం చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

మహనీయులను స్మరించుకోవాలి

ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహనీయులను స్మరించుకోవాలని ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల మునిపాలిటీ బాదేపల్లి పాత బజారు జడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించి, మాట్లాడారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు బూట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించేందుకు సీఎస్ఆర్ నిధులు సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు. డీఈవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో మంజులాదేవి, మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్ రమేశ్, బాదేపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



రథోత్సవానికి ముందు ప్రత్యేక పూజలు చేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కనుల పండువగా అంజన్న రథోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు

- అభయుడి నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు

ఊర్కొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అశేష జనవాహిని నడుమ అభయాంజనేయుడి రథోత్సవం కనుల పండువగా సాగింది. అభయుడి నామస్మరణతో ఆలయ పరిసరాలు, ఊర్కొండపేట పుర వీధులు మార్మోగాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామంలో వెలసిన అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ప్రకాశం, గుంటూరు, కర్నూల్ జిల్లాలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. జైశ్రీరాం, జై హనుమాన్ నామస్మరణతో వేద పండితుల మంత్రోచ్చారణలతో రథం ముందుకు సాగింది. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఆసీనులు చేసి జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్, ఆలయం ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డిలు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం అభయుడిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్వకుర్తి సీఐ నాగరాజు, ఊర్కొండ ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, మాజీ సర్పంచులు ద్యాప నిఖిల్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులు, అర్చకులు దత్తాత్రేయశర్మ, మహేష్‌శర్మ అధికారులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక యువకుడు సుంగం శేఖర్(27)తన ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం శ్రీపురంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన సుంగం శేఖర్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం తీవ్ర కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి ఇంటికి వచ్చిన తల్లి చంద్రమ్మ తన కొడుకు ఫ్యాన్‌కు వేలాడుతుండగా బోరున విలపించింది. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి చూసి శవాన్ని కిందికి దించారు. మృతుడి తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ర్యాలంపాడు మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్

గద్వాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నెట్టంపాడు ఎత్తిపోతల పథకానికి గుండెకాయలాంటి ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల మరమ్మతు పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రాజెక్టుపై సమీక్షించడంతో ఎట్టకేలకు ఫైల్ కదిలింది. రూ.144 కోట్లతో మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. రిజర్వాయర్ కట్టను కొంత తొలగించి కింది నుంచి గ్రౌటింగ్ చేస్తూ వెడల్పు చేయడం, మట్టితో గట్టిపరుస్తూ.. పాలిథిన్ షీట్స్ వేసి రివిట్‌మెంట్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ వేసవిలో పనులు పూర్తి చేసి ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నాలుగు టీఎంసీల నీటిని నిల్వచేసి రెండు పంటలకు సాగునీరు అందించాలని అధికారులు నిర్ణయించారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ సమీక్షతో కదలిక..

నెట్టంపాడు ఎత్తిపోతల పథకంలో కీలకమైన ర్యాలంపాడు రిజర్వాయర్‌కు 2020నుంచి లీకేజీలు ప్రారంభం అయ్యాయి. 2021లో సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించి నాలుగు టీఎంసీల నుంచి రెండు టీఎంసీలకు సామర్థ్యాన్ని తగ్గించింది. అప్పటి నుంచి వానాకాలంలో మాత్రమే సాగునీరు అందిస్తూ యాసంగిలో క్రాప్ హాలీడే ప్రకటించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు ఉండటంతో గతేడాది సెప్టెంబరు 25న ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గట్టు ఎత్తిపోతల పథకం వద్ద సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ర్యాలంపాడు రిజర్వాయర్‌పై చర్చ జరగగా ప్రాజెక్టుల ఈఎన్‌సీ అనిల్ మరమ్మతులకు రూ.100 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని చెప్పారు. మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా రూ.144 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు.

మూడేళ్ల క్రితమే నిపుణుల కమిటీ నివేదిక

ర్యాలంపాడు రిజర్వాయర్ 2012 నుంచి 2020వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగునీటిని అందించింది. 2020లో లీకేజీల సమస్య మొదలైంది. 2021నాటికి మరింత పెరిగి రిజర్వాయర్ కట్టపై ఒత్తిడి పెరిగింది. దానికిందనే ర్యాలయంపాడు గ్రామం ఉండటంతో 2021 అక్టోబరులో నిపుణుల కమిటీ పరిశీలించి నీటి నిల్వ సామర్థ్యం నాలుగు టీఎంసీల నుంచి రెండు టీఎంసీలకు తగ్గించి మరమ్మతులకు నివేదించింది. అప్పటి నుంచి నేటి వరకు ప్రతీ ఏడాది రబీలో హాలీడే ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం 2022 మార్చిలో సర్వే నిర్వహించేందుకు రూ.93 లక్షలతో టెండర్ల ద్వారా ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించింది. అదే ఏడాది సెప్టెంబరులో నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం కాలయాపన చేసింది.



ర్యాలంపాడు రిజర్వాయర్

గట్టు ఎత్తిపోతలకు ర్యాలంపాడే ఆధారం..

కరువుపీడిత ప్రాంతమైన గట్టు, కేటీదొడ్డి మండలాలను సస్యశ్యామలం చేసేందుకు రూ.553 కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న గట్టు ఎత్తిపోతల పథకానికి ర్యాలంపాడు రిజర్వాయరే ఆధారం. దీని నుంచి 2.80టీఎంసీలను ఎత్తిపోసి 33వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందుకోసం గజ్జలమ్మ గుట్ట దగ్గర 1.32 టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇప్పుడు దీనిని నాలుగు టీఎంసీలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. గట్టు ఎత్తిపోతల విజయవంతం కావాలంటే ర్యాలయంపాడు రిజర్వాయర్ పటిష్ఠం కావాలి. అందుకే ప్రభుత్వం దీని మరమ్మతులపై దృష్టి పెట్టింది.

వానాకాలం నాటికి పనులు పూర్తి



నిపుణుల కమిటీ సూచించిన గ్రౌటింగ్‌తో కట్టను వెడల్పుచేసి రివిట్‌మెంట్ నిర్మించడం వంటి మరమ్మతు పనులు చేయడానికి నిర్ణయం తీసుకున్నాం. ఇందుకోసం రూ.144కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదించాం. ప్రభుత్వం కూడా నిర్ణయం త్వరగా తీసుకుంటుంది. వానాకాలం నాటికి పనులు పూర్తిచేసి నాలుగు టీఎంసీలు నింపేందుకు, రెండు పంటలకు నీరందించేందుకు కృషి చేస్తున్నాం.

- రహిముద్దీన్, ఇన్‌చార్జి ఎస్ఈ గద్వాల

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

- జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి, న్యాయాధికారి రజిని



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి రజిని

వనపర్తి క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయాధికారి రజిని అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యాలయాల్లో లేదా పని ప్రదేశాల్లో మహిళలను శారీరకంగా, మానసికంగా వేధిస్తే చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాల్లో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని వివరించారు. ఈ కమిటీల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. మహిళల కోసం ఉద్దేశించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదే విధంగా బాలబాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మైనర్లకు వివాహం చేయడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు, మహిళలకు, వరద బాధితులకు రూ.3లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరూ ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. సందర్భంగా సఖి కేంద్రం కౌన్సిల్ కృష్ణయ్య, సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో, ధర్మారెడ్డి, కళాశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న పీయూ వైస్ ఛాన్సలర్ బీఎన్ శ్రీనివాస్

కొల్లాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కాలుష్యాన్ని నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడాలి.. సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలని పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బీఎన్ శ్రీనివాస్ కోరారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణం, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణాన్ని రక్షించుకోకపోతే భవిష్యత్తులో ఆక్సిజన్ సిలిండర్‌లు వెంటబెట్టుకొని తిరగవలసి వస్తుందని అన్నారు. అలాగే పీజీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ మాట్లాడుతూ... అడవులు భూమికి ఊపిరి తిత్తుల వంటివని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. ఈ సదస్సులో పర్యావరణ పరిరక్షకుడు, సామాజికవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, వక్తలు ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రేనా, డాక్టర్ విజయలక్ష్మి, సదస్సు కన్వీనర్ దేవరాజు, అధ్యాపకులు పత్ర సమర్పకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పునుగుపిల్లిని రక్షించిన అటవీ అధికారులు



చికిత్స అనంతరం సాధారణస్థితిలో ఉన్న పునుగు పిల్లి

మన్ననూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న పునుగుపిల్లిని అటవీ అధికారులు, సిబ్బంది కాపాడారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో అటవీ పెట్రోలింగ్‌లో భాగంగా గుండం రహదారి నుంచి వాహనంలో వెళుతున్న అమ్రాబాద్ ఎఫ్‌డీఓ రామమూర్తి కి రహదారిపై ఏదో గుర్తు తెలియని వాహనం తగిలి గాయపడి చలిలో కొట్టుమిట్టాడుతున్న పునుగు పిల్లి అనే వన్య ప్రాణి కనిపించింది. ఆయన తన సిబ్బంది ద్వారా పునుగుపిల్లిని మన్ననూరు దుర్వాసుల బేస్ క్యాంపుకు తరలించారు. రేంజ్ అధికారి దేవజ, డీఆర్‌వో రవికుమార్ సూచన మేరకు బీట్ అధికారి మధుసూదన్, బయాలజిస్టు మహేందర్ కలిసి గాయపడిన పునుగుపిల్లికి రాత్రంతా చికిత్స నిర్వహించారు. మంగళవారం ఉదయానికి సాధారణ ఆరోగ్య స్థితికి వచ్చింది. బోనులో పునుగుపిల్లిని తీసుకెళ్లి మళ్లీ అడవిలో వదిలిపెట్టారు.

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి



ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుతో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి, పీడీ వేణుగోపాల్, కోచ్, మేనేజర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శారదాబాయి అన్నారు. మెదక్ జిల్లా తుప్రాన్‌లో 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్, కోచ్, మేనేజర్లు రాఘవేందర్, నాగరాజు, కపిల్, వెంకటయ్య పాల్గొన్నారు.

బాల, బాలికల జట్ల వివరాలు

జిల్లా బాలుర జట్టులో నరేశ్‌నాయక్, అనిల్‌నాయక్, శివకుమార్, సాయికుమార్, రంజిత్, గణేష్, కమలాకర్, మోక్షిత్, శశిధర్‌చ వరుణ్, సిద్దర్థ, కార్తీక్, వికాష్, జూబేర్, సాయితేజ ఉన్నారు. బాలికల జట్టులో బీ. గాయత్రి, నందిని, మనీష, నవ్వశ్రీ, శ్రావణి, నందిని, శిరీష, హారిక, రాధిక, ఎ. గాయత్రి, జీ. శిరీష, రక్షిత, అలకానంద, కళ, ప్రవళిక, అంజలి ఉన్నారు.

రగ్బీలో జిల్లా క్రీడాకారులు రాణించాలి

» డీవైఎస్‌వో శ్రీనివాస్



జిల్లా రగ్బీ బాల, బాలికల జట్లతో డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రగ్బీలో జిల్లా క్రీడాకారులు రాణించాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో వచ్చేనెల ఒకటి నుంచి మూడవ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ టోర్నీలో పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను మంగళవారం స్థానిక స్టేడియంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి రమేష్‌బాబు, పీఈటీ సోహెల్ పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన జిల్లా జట్టు

» క్వార్టర్ ఫైనల్‌లో మెదక్‌పై విజయం



జిల్లా జట్టుతో శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని దోమలగూడలో జరుగుతున్న తెలంగాణ అంతర్ జిల్లా టీ-20 క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సెమీస్‌కు చేరింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మెదక్‌పై 33 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. జట్టులో రవితేజ 61 బంతుల్లో 11 ఫోర్లతో అర్ధసెంచరీ (82) పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 145 రన్లు చేసి ఓటమిపాలైంది. జట్టులో రిశ్వంత్ 40 పరుగులు చేశాడు. జిల్లా బౌలర్లలో రవితేజ, రాంచరణ్‌లు చేరో రెండు వికెట్లు తీసి జట్టు విజయానికి కృషి చేశారు. సెమీస్‌కు చేరిన జిల్లా జట్టును కోచ్ మేనేజర్లు నవాజ్, శ్రీనివాస్‌రెడ్డిలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, టీడీసీఏ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వరెడ్డి, ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ అభినందించారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



కోచ్ జ్ఞానేశ్వర్‌తో రవి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు రమావత్ రవి ఇండియన్ రౌండ్ విభాగంలో ఎంపికయ్యాడు. బుధవారం నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న పోటీల్లో ఆయన పాల్గొననున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఇండియన్ రౌండ్ విభాగంలో 345 పాయింట్లు సాధించి స్వర్ణ పతకం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. రాజస్థాన్‌లో ఈ నెల రెండు నుంచి ఆరవ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నాడు. రమావత్ రవి మహబూబ్‌నగర్‌లోని న్యూరిషి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, సెక్రటరీ రాంచందర్, కోచ్ జ్ఞానేశ్వర్ అభినందించారు.

దివ్యాంగుల క్రికెట్ ఇండియా జట్టుకు

గోపాల్‌పేట యువకుడి ఎంపిక



బెంజిమన్ ప్రభాకర్

గోపాల్‌పేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల క్రికెట్ ఇండియా జట్టుకు వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన బెంజిమన్ ప్రభాకర్ ఎంపికయ్యారు. నేపాల్‌లోని ఖాట్మాండులో వచ్చే నెల 14న నిర్వహించనున్న టీ-20 దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్టులో అతడు స్థానం పొందాడు. అయితే అతడి ఆర్థిక పరిస్థితి బాగాలేదని చందాపూర్ గ్రామానికి చెందిన బొదగొని మానసగౌడ్ దృష్టికి తీసుకెళ్లగా రూ.50 వేలు, ప్రొఫెషనల్ క్రికెట్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారుడు ప్రభాకర్ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బెంజిమన్, హాజు, నాగరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే.. పాలెం వెంకన్న

» రేపటి నుంచి ఆరవ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు » నాలుగవ తేదీన రథోత్సవం

» వేలాదిగా తరలిరానున్న భక్తులు » ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ



ఆలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో గర్భాలయ ముఖద్వారం



ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్

బిజినేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తీరితే తిరుపతి, లేకుంటే పాలెం వెంకన్న స్వామిని దర్శించుకొని మొక్కు తీర్చుకోవచ్చని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం క్షేత్రం పేదల తిరుపతిగా విరాజిల్లుతోంది. ఇక్కడ అలువేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి కొలువుదీరి భక్తుల పూజలందుకుంటున్నాడు. గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, విశిష్టతలు, ఉత్సవాల వివరాలతో ప్రత్యేక కథనం..

ఆలయ వ్యవస్థాపకుడు సుబ్బయ్య

పాలెం గ్రామానికి చెందిన తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ (పాలెం సుబ్బయ్య) చుట్టు పక్కల గ్రామాల్లోని పేదలందరికీ ఉచితంగా విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలను ఏర్పాటు చేశారు. కానీ ఆర్థిక ఇబ్బందులతో కొనసాగించడం ప్రశ్నార్థకంగా మారింది. ఆదే సమయంలో అంటే, 1962లో గ్రామానికి చెందిన మనుసాని నీలకంఠయ్య కుమారులు రామలింగయ్య, బాల్‌లింగయ్యల ఆర్థిక సహకారంతో ఆలయాన్ని నిర్మించి, తిరుమల తిరుపతి నుంచి వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను తీసుకొచ్చి ప్రతిష్ఠించి నిత్య పూజలను ప్రారంభించారు. ఇక్కడి మూలవిరాట్ అచ్చంగా తిరుమల తిరుపతి దేవస్థానంలోని స్వామి వారిని పోలి ఉంటుందని పురోహితులు చెప్తుంటారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తుల సహాయ సహకారాలతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.

రూ. 1.5 కోట్లతో అభివృద్ధి పనులు

స్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా శ్రీశైలం, ఉమామహేశ్వరం క్షేత్రాలకు వెళ్ళే కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు వస్తుంటారు. ఆలయ పరిసరాలు ఆహ్లాదకరంగా, ప్రశాంతంగా ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడ సేదతీరి, మరుసటి రోజు శ్రీశైలం దర్శనానికి వెళ్తుంటారు. కాగా క్షేత్రంలో సరైన వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, హెచ్‌ఈఓఎస్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.60 లక్షల వ్యయంతో వసతి గృహాల నిర్మాణం చేపట్టారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డిలు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. రూ.20 లక్షలతో కల్యాణ మండపాన్ని ఆధునికీకరించారు. రూ.12 లక్షలతో ఆలయ ప్రాంగణంలో షెడ్ నిర్మించారు. మరో రూ.10 లక్షల వ్యయంతో ఆలయం చుట్టూ సీసీ రోడ్ల నిర్మాణం, బోరు మోటర్, హైమాస్ట్ లైట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టి ఆలయాన్ని అభివృద్ధి చేశారు.

ఉత్సవాలకు పూర్తయిన ఏర్పాట్లు

ప్రతీ సంవత్సరం మాఘ మాసంలో పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల ఆరవ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు 30వ తేదీన స్వామి వారికి అభిషేకం, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, పాలెం పూర్వ విద్యార్థుల సేవా సమితి, చైతన్య కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి భాగవత పద్య పఠన పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం రక్షాబంధనం, హంసవాహన సేవ ఉంటాయి. 31న నిత్యారాధన, బలిహరణం, ధ్వజారోహణం, గరుడ పొంగలి నివేదన, సంతానం లేని వారికి ప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయి. ఆ తర్వాత హనుమంత వాహన సేవ, నివేదన నిర్వహిస్తారు. వచ్చేనెల ఒకటిన ప్రబంధ పారాయణం, లక్ష పుష్పార్చన, రెండున డాక్టర్ పి.భాస్కర యోగి ధార్మిక ప్రవచనం, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం గజ వాహన సేవ ఉంటుంది. మూడున వేంకటేశ్వర స్వామి భజన మండలి నేతృత్వంలో జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం పల్లకీ సేవ ఉంటుంది. నాలుగున సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, హోమం, కుంభము, రథోత్సవం (తేరు) నిర్వహించనున్నారు. ఐదవ తేదీన పాలెం పూర్వ విద్యార్థుల సేవా సమితి ఆధ్వర్యంలో మండల స్థాయి గోవింద నామాల పోటీ, ఉద్దాల మహోత్సవం నిర్వహించనున్నారు. ఆరున చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహిస్తారు. ఆ తర్వాత సాయంత్రం పుష్పయాగం, శేషవాహన సేవ, పవళింపు సేవ, పండిత సన్మానంతో ఉత్సవాలు ముగియనున్నాయి.



ఆలయంలోని రథం

పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం



పిలిస్తే పలికే దైవ్యంగా పాలెం వేంకటేశ్వర స్వామి ప్రసిద్ధి గాంచారు. తిరుమల తిరుపతి ఏడుకొండల స్వామిని దర్శించుకుంటే కలిగిన అనుభూతే పాలెం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నప్పుడు కలిగింది. అప్పటి నుంచి స్వామి వారి సేవలోనే ఉన్నాను. ఆలయ అభివృద్ధికి నాతో పాటు కుటుంబ సభ్యులను భాగస్వాములను చేసి తోడ్పాటు అందించాం. గతేడాది ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆలయ అభివృద్ధికి కృషి చేశాను.

- జున్న శేఖర్ రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్త

అందరి సహకారంతో ఉత్సవాలు



అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. వెంకన్న స్వామి రథోత్సవానికి ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచి భక్తులు తరలి రానున్నారు. అర్ధరాత్రి దాటే వరకు కొనసాగుతుంది. గ్రామ యువత వలంటీర్లుగా సేవలు అందిస్తారు.

- సీహెచ్ రంగారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి

బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాల తయారీ

» మగ్గానికి పూజలు చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మగ్గానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, చేనేత కార్మికులు

గద్వాల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కోటలో వెలసిన భూలక్ష్మీ చెన్నకేశవ స్వామి, జములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాల నేత పనిని మంగళవారం ప్రారంభించారు. గద్వాల చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కోటలోని రామాలయంలో పట్టు వస్త్రాలు నేసే మగ్గానికి ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రెండు ఆలయాల్లో ఒకేసారి వచ్చేనెల 12న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఆ రోజులోగా స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సిద్ధం చేయాలని సూచించారు. అంతకు ముందు ఆయన చెన్నకేశవస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గద్వాల చేనేత ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అక్కల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మంత్రి సురేశ్, చిలువేరి సాయిబాబా, ఎగ్బోటే సురేశ్, చేనేత కార్మికులు అక్కల శాంతారాం, ఖాఖ రాము, కోట చిన్ననరసింహులు, వడ్డె వెంకటేష్, భావండ్ల శ్రీహరి, వాసు నీలమ్మ, కొంకతి రేణుక తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు

» రూ. 20,200 జరిమానా

మరికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాలికను వేధించి, కొట్టి ఆమె ఆత్మహత్యకు కారణమైన యువకుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి మహబూబ్‌నగర్ కళాశాలలో చదువుకుంటున్నప్పుడు తెలుగు వంశీ (చింటూ) అనే యువకుడు ఆమెను ప్రేమ పేరుతో వేధించాడు. ఎవరితోనైనా మాట్లాడితే చంపేస్తానని బెదిరించేవాడు. అంతకు ముందు తీసుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేసేవాడు. వేధింపులు భరించలేక 2017, సెప్టెంబర్ 13న ఆమె స్వగ్రామానికి చేరుకున్నది. అదే రోజు రాత్రి అందరూ నిద్రపోతుండగా, పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయంపై యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, అప్పటి మరికల్ ఎస్‌ఐ జములప్ప కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణ చేపట్టారు. అనంతరం సీఐ రాంలాల్ కోర్టులో చార్జిషీటు వేశారు. ప్రస్తుత సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రాములు ఆదేశం మేరకు ఏఎస్‌ఐ, లైజనింగ్ అధికారి కృష్ణయ్యగౌడ్, సీడీవో వీరప్ప సాక్షులు హన్మంతు, శ్రీధర్‌లను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేనుశ్రీ కేసు వాదించారు. వాదోపవాదాల అనంతరం మంగళవారం నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 20,200 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్, అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి వింధ్యా నాయక్ తీర్పు వెల్లడించారు.

తల్లి, తమ్ముడిపై దాడి

వ్యక్తిపై కేసు నమోదు

దామరగిద్ద, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భూవివాదం నేపథ్యంలో తమ్ముడితో పాటు, తల్లిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దామరగిద్ద ఎస్‌ఐ పి.రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, దామరగిద్ద గ్రామానికి చెందిన చెన్నారం కిష్టమ్మ పెద్ద కుమారుడు బసిరెడ్డి, చిన్న కుమారుడు నారాయణరెడ్డిల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. పెద్ద కుమారుడు బసిరెడ్డి ఆవేశంలో తల్లీ, తమ్ముడిపై దాడి చేసి గాయపరిచాడు. తల్లి కాలు విరిగింది. సంఘటనపై నారాయణ రెడ్డి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు బసిరెడ్డిని మంగళవారం నారాయణపేట కోర్టులో హాజరు పరిచి, న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వేడి నీరు మీద పడి చెంచు బాలుడికి గాయాలు



చికిత్స పొందుతున్న బాలుడు

మన్ననూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వేడి నీరు మీద పడి ఓ చెంచు బాలుడు గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలోని పుల్లాయపల్లి చెంచు పెంటలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. చెంచు పెంటకు చెందిన తోకల రవికుమార్, బాలమ్మ దంపతులకు ఐదుగురు సంతానం ఉన్నారు. మంగళవారం ఉదయం తల్లి బాలమ్మ ఇంట్లో కట్టెల పొయ్యిపై అన్నం వండుతోంది. పిల్లలు పొయ్యి చుట్టూ కూర్చొని చలి కాపుకుంటున్నారు. అదే సమయంలో మూడో కుమారుడు రాఘవేంద్ర అదుపుతప్పి పొయ్యి మీదున్న పాత్రకు తగలడంతో మసలుతున్న నీరు అతడిపై పడింది. దీంతో బాలుడికుడి చేయి, కాళ్లపై బొబ్బలు వచ్చాయి. విషయం తెలుసుకున్న అప్పాపూర్ మాజీ సర్పంచి బాలగురువయ్య ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడికి సమాచారం అందించారు. ఆయన వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌ను పుల్లాయపల్లి చెంచు పెంటకు పంపించారు. బాలుడిని మన్ననూరులోని ఆర్‌టీటీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.

క్రైం కార్నర్

ఆయిల్ పామ్ తోటల దగ్ధం

» రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం

అచ్చంపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఆయిల్ పామ్ తోటలు దగ్ధమయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిరుపతి రెడ్డి, అదే గ్రామానికి పద్మ 8.5 ఎకరాలలో అయిల్ పామ్ సాగు చేశారు. పక్కనే ఉన్న విద్యుత్ తీగల వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో తోటకు నిప్పంటుకున్నది. గమనించిన రైతులు వెంటనే అచ్చంపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికీ గోల పూర్తిగా కాలి బూడిదై, దాదాపు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. ఉద్యాన శాఖ అధికారులు ఎండీ రసూల్, ఇబ్రహీంలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అయిజ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. కర్నూలు జిల్లా, నందవరం మండలం, మాచవరం గ్రామానికి చెందిన హనుమంతు (38) మంగళవారం ఉదయం తన అత్తగారి ఊరైన వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామానికి వచ్చాడు. సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా, అయిజ మండలం, వెంకటాపురం స్టేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో హనుమంతు అక్కడికక్కడే మృతి చెందాడు.

మహిళతో అసభ్య ప్రవర్తన

» వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని ఓ తండాకు చెందిన మహిళ ఈ నెల 21న రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా, ఇస్లావత్ గోపాల్ అనే వ్యక్తి తలుపు కొట్టాడు. దీంతో తలుపు తెరిచిన ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె భర్త అడ్డుకొని నిలదీయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని కోరినా అతడు రాకపోవడంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

'పదేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

కల్వకుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు కార్మికులకు సైతం మూడేళ్లకోసారి బదిలీలు అవుతుండగా కొంతమంది ఉద్యోగులు బదిలీలు కాకుండా పదేళ్లపాటు ఒకే చోట పని చేస్తున్నారని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 327సబ్ డివిజన్ కోశాధికారి కేశవులు అన్నారు. మంగళవారం పట్టణంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పులు చేస్తూనే మళ్లీ 327 యూనియన్‌పై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విలేకర్ల సమావేశంలో యూనియన్ నాయకులు యాకుబ్ బాబా, జాంగీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

'1104 యూనియన్‌పై తప్పుడు ప్రచారం తగదు'

చారకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) 327 యూనియన్ ఉనికి కోసం తప్పుడు ప్రచారాలు చేయడం తగదని ఆయూనియన్ ని 1104 యూనియన్ మండల కోశాధికారి బాలునాయక్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన 1104 యూనియన్‌పై తప్పుడు ప్రచారాలు చేయడం సరైంది కాదని అన్నారు. కార్యక్రమంలో చారకొండ లైన్ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్, కన్నానాయక్, అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటేష్, జూనియర్ లైన్‌మెన్ ఆయుబ్‌ఖాన్, శ్రీశైలం పాల్గొన్నారు.

'7న మాదిగల సభను విజయవంతం చేయాలి'

తెలకపల్లి/ వెల్దండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్‌ను ఏబీసీడీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు తెలకపల్లి, వెల్దండ మండలాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశాలు నిర్వహించారు. తెలకపల్లి మండల పరిధిలోని పెద్దపల్లిలో ఆలేటి స్వామి ఆధ్వర్యంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించిన మాట్లాడారు. వెల్దండలోని ఏవీఆర్ గార్డెన్‌లో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ, వీరస్వామి మాదిగ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మాదిగ ఉప కులాలకు న్యాయం జరగాలంటే వర్గీకరణ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి గ్రామ మాదిగ నాయకులు విష్ణు, సాయిబాబు, మహేష్, రామకృష్ణ, స్వామి, కరుణాకరన్, రాము, పోలే రాజు, కాటిక రామస్వామి, కుర్మిద్ద యాదగిరి, గుద్దటి రామస్వామి, పోలే అశోక్, సామేల్, పుల్లయ్య, అంజయ్య, శేఖర్, పెద్దయ్య, శివ, రామరాజు, శ్రీను, బాస్కర్, వెంకటయ్య, బాలజంగయ్య ఉన్నారు.

'వేరుశనగకు మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగ పంటకు క్వింటాలుకు మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి వేరుశనగకు చెల్లిస్తున్న ధరను రైతులు, మార్కెట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పల్లీకి మద్దతు ధర గరిష్ఠంగా రూ.6359, కనిష్ఠ మద్దతు ధర రూ.4683 చెల్లిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి.వెంకటేష్, శివ రాములు, సురేష్, సుభాష్, రైతులు శివయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి : బీజేపీ

అమ్రాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత సోమవారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన సంఘటన దురదృష్టకరమని, ఈ దాడిని తాము ఖండిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.బీజేపీ మండల అధ్యక్షుడు గోలి రాజు, చంద్రయ్యగౌడ్, శంకర్‌గౌడ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నోముల సత్యనారాయణ, సిద్ధి సీనయ్య ఉన్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు రైతు భరోసా ఇవ్వాలి : టీడీపీ

ఉప్పునుంతల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ రైతుకు రైతు భరోసా ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రేవల్లి కాశన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వానాకాలం పెట్టుబడి ఇవ్వకుండా మోసం చేశారని పేర్కొన్నారు. రైతు భరోసా కోసం మండలానికి పైలెట్ గ్రామంగా ఒక గ్రామాన్ని ఎంపిక చేస్తే, మిగతా గ్రామాల్లోని రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

నల్లమల వాసులకు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ స్మారక అవార్డు

అమ్రాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ స్మారక అవార్డును నల్లమల ప్రాంతానికి చెందిన ప్రముఖ కళాకారులు జక్క గోపాల్, గాజుల లక్ష్మీనారాయణలు అందుకున్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ అవార్డులను ఈనెల 26వ తేదీన రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటించగా, తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, విమలక్క మంగళవారం హైదరాబాద్‌లో వీరికి అందజేశారు.

అర్హులైన వారికే రైతు భరోసా

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్/ బల్మూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులకు ప్రభుత్వం రైతు భరోసా పథక లబ్ధిని చేరవేయడమే ప్రధాన లక్ష్యమని, సంక్షేమ పథకాల అమలులో అధికారులే కీలకమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో కలిసి సంక్షేమ పథకాల అమలు తీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో చర్చించారు. వ్యవసాయానికి అనుకూలమైన భూములను మాత్రమే గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతను పురస్కరించుకుని ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా రవాణా శాఖ అధికారి చిన్న బాలు, రోడ్డు సేఫ్టీ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

● బల్మూరు మండల పరిధిలోని చెంచుగూడెం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో జట్టి రాఘవులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నాగర్‌కర్నూల్ టౌన్ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నాగనూలు కేజీబీవీ పాఠశాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని డార్మెటరీ, స్టోర్ రూం, కిచెన్, ప్లేగ్రౌండ్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఈవో రమేష్‌కుమార్, మునిసిపల్ కమీషనర్ నరేష్‌కుమార్, గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

రైతులూ.. మాయమాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే వంశీకృష్ణ



మార్కెట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు మాయమాటలు నమ్మిమోసపోయి కుట్రదారుల వలలో పడకండి అని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రజిత భర్త అంతటి మల్లేష్, వ్యవసాయ కార్యదర్శి ఇతర డైరెక్టర్లపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పథకం ప్రకారమే రైతు ముసుగులో బీఆర్ఎస్ కార్యకర్తలు దాడులకు పూనుకోవడం దారుణమన్నారు. ఈదాడి వెనుక ప్రధాన సూత్రధారి బీఆర్ఎస్ నాయకుడు గువ్వల బాలరాజ్‌యేనన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సంబంధిత పోలీస్‌శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, నాయకులు మల్లేష్, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, రామనాథం, వెంకట్‌రెడ్డి, గౌరీశంకర్, బుచ్చి రాములు పాల్గొన్నారు.

విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలి

- అదనపు ఎస్పీ సీహెచ్.రామేశ్వర్

తాడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళలు, విద్యార్థినులు మానసిక దృఢత్వంతో ముందుకెళ్లి ధైర్యంగా ఉండాలని అదనపు ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో షీటీం వారు పోక్సో చట్టం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాలలు, బస్సులు, ఆటోల్లో ప్రయాణంలో ఉన్న మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడూరు ఎస్ఐ రాజశేఖర్, స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లయ్య, షీటీం మెంబర్లు వెంకటయ్య, వెంకట్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు

బిజినేపల్లి : గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయొద్దని ఎస్ఐ కె.శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆంజనేయులు, ఏఎస్ఐలు శ్రీనివాసులు, సయ్యద్ అలీ, రవినాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

-సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి

కల్వకుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని కల్వకుర్తి సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కావ్యలు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సత్యసాయి మందిర్‌లో ప్రభుత్వ పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారితోపాటు వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ హాజరయ్యారు. న్యాయాధికారులు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ విద్యార్థులకు ప్రేరణ కల్పించారు.

నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగులకు నష్టం

- టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాత్లావత్ గోపాల్



అచ్చంపేటలో యూపీఎస్ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు

అచ్చంపేటటౌన్/ మన్ననూర్/ చారకొండ/ వంగూరు/ వెల్దండ,జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగులకు ఎలాంటి లాభాలు లేవని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాత్లావత్ గోపాల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యూపీఎస్ నోటిఫి కేషన్ ప్రతులను టీఎస్‌సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు . అదే విధంగా అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూర్ ప్రభుత్వఐటీఐ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యూపీఎస్ నోటిఫికేషన్ ప్రతులను సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి లాలమోని శంకరయ్య ఆధ్వర్యంలో దహనం చేశారు. అచ్చంపేట డివిజన్ ఉద్యోగులు, భాస్కర్, ప్రవీణ్, లక్ష్మణ్, రాజు, సురేష్, జానకమ్మ, రేణుక, శాంతి, మాధవి, కవిత, సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు మహమ్మద్ అబ్దుల్ ఖాయూమ్ పాల్గొన్నారు. చారకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల కాంప్లెక్స్ సమావేశం అనంతరం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)కు వ్యతిరేఖంగా సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి, ఉపాధాయులు కమలాకర్, జంగునాయక్, సత్యనారాయణ, అంజనేయులు, గోపాల్, నిర్మల, భూపాల్‌రెడ్డి, బాలోజి, గీత, ఉమాదేవి, విద్యావతి, కవిత, స్వప్న, రాజ్యలక్ష్మి, డాక్యనాయక్, మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వంగూరులో కాంప్లెక్ మీటింగ్ వద్ద మధ్యాహ్న సమయంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు సైదులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జీవో ప్రతులను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. సుధారాణి, మల్లేష్, జంగయ్య, ఉదయ్, ఆంజనేయులు, అంజమ్మ పాల్గొన్నారు. వెల్దండలోని కొట్ర కాంప్లెక్స్ సమావేశంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు యూపీఎస్‌కు వ్యతిరేకంగా జీవో ప్రతులను కాల్చారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు రాములు, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మన్, కోశాధికారి స్వామి, కార్యదర్శి రవీందర్, దేవేందర్, హరిప్రసాద్, ప్రసన్న, సమత ఉన్నారు.

పండిత పరిషత్ క్యాలెండర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు నూతన క్యాలెండర్ 2025ను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ ఆవిష్కరించారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రాష్ట్రీయ పండిత పరిషత్తు జిల్లా అధ్యక్షుడు బీ.వీ.సుదర్శన్ ఆధ్వర్యంలో డీఈవోకు మర్యాదపూర్వకంగా కలిసి ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, విద్యాశాఖ నోడల్ అధికారి కురుమయ్య, నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి'

బల్మూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియట్ బైపీసీ రెండవ సంవత్సరం చదువుతున్న ఉడతనూరి సౌమ్య(18) ఆత్మహత్యకు వార్డెన్‌గా పని చేస్తున్న ప్రిన్సిపాల్ విజయలలితారెడ్డి వేధింపులే కారణమని ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. సౌమ్యనుద్దేశించి మీరు చెంచులు గనుక చదువు రాదని, మీరు తిండికోసమే హాస్టల్‌కు వస్తారని అవమానపరుస్తున్నట్లు సౌమ్య తన తల్లికి పలుమార్లు ఫోన్ ద్వారా చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్క బాలయ్య, పౌరహక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్దునూరి లక్ష్మీనారాయణ, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు బియ్యని వెంకటేశ్, నారుమళ్ల లక్ష్మీనారాయణ, పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం

ఊర్కొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఊర్కొండ గేటు వద్ద మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. మాదారం మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా తన సొంత నిధులతో మండలంలోని 13 గ్రామాల్లో సుమారుగా 10 లక్షలతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం సంతోషదాయకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి, నాయకులు ఆదినారాయణ, అబ్దుల్‌సమి, మనోహర్‌రెడ్డి, వహీద్, రవి, ఆంజనేయులు, గోపీనాయక్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా చేపడుతాం

వెల్దండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పారదర్శకంగా చేపడుతామని గృహనిర్మాణశాఖ జిల్లా పరిశీలకులు బాల్‌రాం అన్నారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా ఎంపికైన చెర్కూర్ గ్రామాన్ని బాల్‌రాం మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారి స్థితిగతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి సంగప్ప, డీఈ ఆనంద్‌రెడ్డి, గ్రామప్రత్యేక అధికారి దేవన్న, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మన్, ఈసీ దేవేందర్‌గౌడ్, ఏఈ రాజవర్దన్‌రెడ్డి, కార్యదర్శి హరిణి, మాజీ సర్పంచ్ రేవతి ఉన్నారు.

బాల కార్మికుడికి విముక్తి

వంగూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కాపరిగా పనిచేస్తున్న బాలకార్మికునికి విముక్తి లభించింది. మండలంలోని రంగాపూర్ తండాలో 15 సంవత్సరాల బాలుడు గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. ఆపరేషన్ స్మైల్ టీమ్ బృందం మంగళవారం ఆతండాకు వెళ్లి, బాలుడిని ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడి నుంచి రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లి బడిలో చేర్పించారు. గతంలో బాలుడు 8వ తరగతి చదివి మానేశాడు. బాలుడి తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక పోలీస్ స్టేషషన్‌లో తండ్రి గంగయ్యపై జీడీ ఎంట్రీ చేశారు. పిల్లలను బడికి పంపకుండా పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ మహేందర్ హెచ్చరించారు. కార్యక్రమంలో స్మైల్ టీమ్ ఎస్ఐ కృష్ణయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహేందర్‌రావు, ఏఎస్ఎస్ఐ వెంకటయ్య ఉన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

కందనూలు/ అచ్చంపేట/ అమ్రాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మాచారి భవన్‌లో ఏఐటీయూసీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు, బాలపీరు, ప్రకాశ్ పాల్గొన్నారు. ● అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ సంఘం డివిజన్ నాయకుడు పాత్కుల శ్రీశైలం ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తక్షణమే అనుచిత వ్యాఖ్యలను ఉపసహరించుకొని, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంఎంగౌడ్, నాయకులు శ్రీనివాసులు, ఆనంద్, పర్వతాలు, సతీష్, ఎల్లస్వామి, జగన్, పాండు, రాజేష్, రాములు పాల్గొన్నారు. గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను వివిధ సంఘాల ఆధ్వర్యంలో అమ్రాబాద్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దహనం చేశారు. వివిధ సంఘాల నాయకులు నాసరయ్య, బాల కిష్టయ్య, మోహన్, జమీల్, అనిల్, అరుణ్ ఉన్నారు.



కేంద్రమంత్రి బండి సంజయ్ చిత్రపటాన్ని దహనం చేసిన నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి

15 రోజుల్లో యాక్షన్ ప్లాన్

» ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో మునిసిపల్ కమిషనర్ బి. నరేష్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పురపాలికలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు 15 రోజుల్లో యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ బి.నరేష్ కుమార్ స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధిలైట్లు, పార్కుల నిర్వహణకు పెద్దపీట వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డిల ప్రత్యేక చొరవతో నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో కొత్త రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ రూపకల్పన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మునిసిపాలిటీ పరిధిలో జనం ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కమిషనర్‌తో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అపూర్వమైన స్పందన వచ్చింది. ప్రజల ప్రశ్నలకు మునిసిపల్ కమిషనర్ ఇచ్చిన సమాధానం వారి మాటల్లోనే...

ప్రశ్న : అంబేడ్కర్ కాలనీలో పారిశుధ్య పనులు సజావుగా జరగడం లేదు. అంబేడ్కర్ విగ్రహం నుంచి గొల్లగేరి వరకు మురుగు కాల్వ శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమల బాధ అధికమైంది.

- పొడుగు రాఘవులు, పాలమూరు ప్రసాద్, ఏటీగడ్డ రవి, అంబేడ్కర్ కాలనీ రెండవ వార్డు.

కమిషనర్ : సీసీ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. మురుగు కాల్వను రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం. చెత్త సేకరణకు ఆదేశిస్తాం.

ప్రశ్న : నాగనూల్‌లోని వడ్డెగేరిలో రోడ్లపై మురుగునీరు పారి, రాత్రి పూట దోమలు ఎక్కువై, కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శ్మశానానికి వెళ్లే దారిలో కంపచెట్లు విపరీతంగా పెరిగాయి.

- పస్పుల శ్రీనివాసులు, సుబ్బయ్య, సైదులు, నాగనూల్

కమిషనర్ : రెండు రోజుల్లో వడ్డేగేరిని సందర్శిస్తా. అక్కడ సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ముళ్ల పొదలను తొలగించేలా చర్యలు తీసుకుంట.

ప్రశ్న : జిల్లా కేంద్రంలోని రెండవ వార్డులో కరెంటు స్తంభాలు లేవు. వీధి లైట్లు లేకపోవడం వల్ల భయం భయంగా కాలం వెల్లదీస్తున్నాం. జాఫర్ సేట్ కాంపౌండ్ వరకు ఈ సమస్య తీవ్రంగా ఉంది.

- గబ్బి రాజశేఖర్, రెండవ వార్డు

కమిషనర్ : రెండవ వార్డులో కరెంటు స్తంభాలు, డ్రైనేజీ సమస్య నా దృష్టికి వచ్చాయి. తప్పక పరిష్కరిస్తాం. ఇక్కడ చేయాల్సిన పనులపై ఇంజనీరింగ్ అధికారులతో రెండు రోజుల్లో నివేదిక తెప్పించుకుంటాం.

ప్రశ్న : 22వ వార్డులో కాలనీవాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. వీధి లైట్లు, సీసీ రోడ్లు లేవు. తాగునీటికి అల్లాడిపోతున్నాం.

- గంధం ప్రసాద్, 22వ వార్డు

కమిషనర్ : నాగర్‌కర్నూల్ పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి రోజుకు 50లక్షల లీటర్లు కావాలి. మిషన్ భగీరథ, వివిధ వనరుల ద్వారా రోజుకు 25లక్షల లీటర్ల నీళ్లు మాత్రమే వస్తున్నాయి. దీన్ని సర్దుబాటు చేసే క్రమంలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవం. దీన్ని అధిగమించేందుకు అమృత్-2.0పథకం కింద రూ.35 కోట్ల వ్యయంతో కొత్తగా ఐదు ట్యాంకులు నిర్మించి పైపులైన్లు వేసేందుకు సర్వే జరుగుతోంది. నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. వీధి లైట్లకు సంబంధించిన అంశాన్ని రెండు రోజుల్లో గుర్తిస్తాం. కొత్తగా అవసరమయ్యే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : నాగర్‌కర్నూల్ నుంచి నల్లవెల్లి వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది రెగ్యులర్‌గా రావడం లేదు.

- రమేష్, 19వ వార్డు

కమిషనర్ : నాగర్‌కర్నూల్-నల్లవెల్లి రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. సిబ్బంది సమస్య ఉంది. త్వరలోనే ఈ సమస్యను అధిగమిస్తాం.

ప్రశ్న : నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువును ఆక్రమించి కట్టిన నిర్మాణాల విషయంలో చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. ప్లాస్టిక్ నిషేధంపై ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదు.

- రాజశేఖర్‌శర్మ, 22వ వార్డు

కమిషనర్ : ఖచ్చితంగా అక్రమ నిర్మాణాలపై చర్యలు ఉంటాయి. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించాం. ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ నిషేధం అమలును కట్టుదిట్టం చేస్తాం.

ప్రశ్న : గ్రామ సమీపంలోని బీసీ గురుకుల పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు కూడా శిథిలావస్థకు చేరాయ.

- సత్యారెడ్డి, ఉయ్యాలవాడ

కమిషనర్ : స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఏఈని పంపించి శిథిలావస్థకు చేరిన స్తంభాల వివరాలు తెలుసుకుని కొత్తవాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ బి.నరేష్‌కుమార్

ప్రశ్న : సంతబజార్‌లోని మిరప పొడి గిర్నీలతో శ్వాస సంబంధమైన అనారోగ్యం ఏర్పడుతోంది. దీనిపై చర్యలు తీసుకోండి

- ప్రభాకరావారి సంత బజార్

కమిషనర్ : కారం పొడి గిర్నీల వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న వారికి నెంబర్లు కేటాయించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బీసీ కాలనీలో రోడ్లను ఆక్రమించి కూడా కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

- వర్థం పర్వతాలు, బాలరాజు, 17వ వార్డు

కమిషనర్ : హౌసింగ్‌బోర్డు, శ్రీపురం రోడ్డు బీసీ కాలనీలకు సంబంధించి కోర్టులో కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది కలెక్టర్ దృష్టిలో కూడా ఉంది. కోర్టు కేసులు పరిష్కారం కాకుండా ఇంటి నెంబర్లు ఇవ్వడానికి వీలు కాదు. రోడ్లను ఆక్రమించి చేస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : చెన్నయ్య హాస్పిటల్ ఏరియాలో కుక్కల భయంతో వణికిపోతున్నాం. కుక్కలు వెంటపడి తరుముతున్నాయి.

- సుదర్శన్, 24వ వార్డు

కమిషనర్ : పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని వెటర్నరీ డాక్టర్ల సహకారంతో రెండు రోజుల్లో ప్రారంభిస్తాం.

ప్రశ్న : రెండవ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేక పందుల బాధ తీవ్రంగా ఉంది. డ్రైనేజీ నీళ్లు రోడ్లపై పారుతోంది. ఓపెన్ ప్లాట్లలో ముళ్లపొదలు పెరిగి పంది కొక్కుల సమస్య అధికమైంది.

- శ్రీను, 2వ వార్డు

కమిషనర్ : పట్టణంలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాను గుర్తిస్తున్నాం. ఓపెన్ ప్లాట్లలో పెరిగిన ముళ్ల పొదలను మునిసిపల్ నిబంధనల ప్రకారం వాటి యాజమానులు తొలగించాలి.

ప్రశ్న : రహత్‌నగర్ కాలనీలో చెత్తశుభ్రం చేయడానికి సిబ్బంది రావడం లేదు. చెత్త బండి కూడా రెగ్యులర్‌గా రాదు.

- స్వర్ణ, రిటైర్డు టీచర్, రహత్‌నగర్ కాలనీ

కమిషనర్ : మీ కాలనీలోని సమస్యలను రెండురోజుల్లో పరిష్కరిస్తా. రెగ్యులర్‌గా చెత్త బండి, వీధిని శుభ్రం చేయడానికి పారిశుధ్య సిబ్బందిని పంపిస్తాను.

ప్రశ్న : ఎండబెట్ల ఆలయం వెనక మంచి నీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం వస్తోంది.

- తిరుపతయ్య, ఎండబెట్ల

కమిషనర్ : నేను మీ వార్డును సందర్శిస్తాను. తాగునీటి ట్యాంకును శుభ్రం చేసేలా తక్షణం చర్యలు తీసుకుంటా.

ప్రశ్న : హౌసింగ్‌బోర్డులోని శివసాయి కిరాణం షాపు వెనక ముళ్ల పొదలు పెరిగి విష పురుగులు ఇండ్లలోకి వస్తున్నాయి.

- తులసి, హౌసింగ్‌బోర్డు

కమిషనర్ : పురపాలిక సంఘం జేసీబీ ద్వారా అక్కడున్న ముళ్ల పొదలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మా వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రైనేజీ పైన కప్పే మూతలు విరిగిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధి లైట్ల సమస్య కూడా ఉంది.

- కందికొండ గీత, 23వ వార్డు

కమిషనర్ : అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటాం. కొత్తగా ఏర్పాటు చేయాల్సిన వీధి లైట్లపై సర్వే నిర్వహిస్తున్నాం. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న జైపాల్‌యాదవ్

వెల్దండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, యాదగిరి, మహేష్‌లను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ పరామర్శించారు. వారికి ఒక్కొక్కరికి ఐదువేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు జంగిలి యాదగిరి, నాయకులు నిరంజన్, చల్ల మధుసూదన్‌రెడ్డి, ఆనందు, బిట్టు సైదులు, నర్సింహ ఉన్నారు.